

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రజా విప్లవ గాయకుడు గద్దర్ అకాల మరణం తీరని లోటని సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడారు. బుచ్చయ్యపేట మండలం జెడ్పిటిసి దొండా. రాంబాబు, .సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు జె.సుబ్బారావులు గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న జెడ్‌పిటిసిలు గంగరాజు, రాంబాబు

వరద బాధితులకు సత్వర సాయం

- దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు
- త్వరితగతిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ
- ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెల్లడి



వరద బాధితుల సమస్యలు వింటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-కూనవరం, పాడేరు

వరద ముంపు బాధితులకు సత్వరమే సాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కూనవరం మండలంలో పర్యటించారు. నక్కలగుట్ట గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై అధికారులు ఏర్పాటు ఫొటో ప్రదర్శనను తిలకించారు. అక్కడనుండి నేరుగా కూనవరం బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత గ్రామాల్లో బాధితులకు సహాయ చర్యల కోసం అధికారులకు తగిన సమయం ఇచ్చామని, నిధులు అందించామని తెలిపారు. సహాయక చర్యలు అందకపోతే చెప్పాలని బాధితులను ప్రశ్నించారు. అధికారులు సక్రంగా స్పందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. వరద బాధితులకు నిత్యవసర సరుకులు, కూరగాయలు, పప్పులు, ఆయిలు పంపిణీ చేశామన్నారు. వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు, ప్రతి బాధిత కుటుంబానికి రూ.2 వేలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పోలవరం ముంపు బాధితులకు పారదర్శకంగా పునరావాస ప్యాకేజీ అందిస్తామన్నారు. ముంపు ప్రాంతాల్లో లిడార్ సర్వే చేయడం వలన బాధితులందరికీ సమన్యాయం జరుగుతుందని చెప్పారు. కూనవరం, విఆర్ పురం మండలాలకు సంబంధించిన ప్రధాన రహదారి వరకు రోడ్లు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని కొంతమంది సర్పంచులు కోరగా, ఆ దిశగా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి చెప్పారు. అనంతరం బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ అనంత బాబు, రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఎస్పీ తుహిన్ సిన్హా, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ ఐ వెంకటేష్‌ను పొగిడిన ముఖ్యమంత్రి

గతేడాది వచ్చిన వరదలలో ఎస్ఐ వెంకటేష్ చేసిన సేవలు మండల ప్రజలు తనకు ఇది వరకే తెలిపారని, ఇప్పుడు వచ్చిన వరదలలో కూడా ప్రజలకు సహాయం చేసి మండల ప్రజల్ని కాపాడరని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే ఆగష్టు 15న మెడల్స్ ఇచ్చే వేడుకలో వెంకటేష్ పేరు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచించారు.

వాహనదారులకు ఇక్కట్లు..

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు రహదారిని బంద్ చేయడంతో మండలంలో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుపక్కనే సభ ఏర్పాటు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

ఎంపిక చేసిన వారే సభకు హాజరు

ముఖ్యమంత్రి సభకు నిజమైన వరద బాధితులను అనుమతించలేదు. వైసిపికి అనుకూలంగా ఉన్న వారిని గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు ఎంపిక చేసి వారిని మాత్రమే ముఖ్యమంత్రి కార్యక్రమానికి అనుమతించారు. వారితో వరదల సమయంలో ప్రభుత్వం ఆదుకుందని, పూర్తిస్థాయిలో సహాయం అందించిందని చెప్పించారు. ఏ మాత్రం ప్రశ్నించే వారికి, ఇతర పార్టీల వారికి, సమస్యలపై అవగాహన ఉన్న వారికి అవకాశం ఇవ్వకపోవడంతో ప్రజలు నిరాశతో వెనుతిరిగారు.

మళ్లీ మోసగించే ప్రయత్నం చేసిన సిఎం : సిపిఎం

ముంపు మండలాల ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పష్టత లేని సమాధానంతో మళ్ళీ మోసం చేశారని సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు. కేంద్రం ఇస్తేనే ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. మొన్నటి దాకా కాంటూరు ఇప్పుడు లిడార్ సర్వేల పేరు చెప్పి మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి చేసి తెచ్చి గతేడాది వచ్చిన వరదలకు మునిగిన ప్రతి గ్రామానికి పరిహారం ఇచ్చి తరలించాలని డిమాండ్ చేశారు.

పొగడ్తలతోనే సభ ముగింపు : టిడిపి

సభ మొత్తం పొగడ్తల తోనే ముగిసిందని టీడీపీ మండల అధ్యక్షులు భరపాటి ప్రకాష్ అన్నారు. 6 నెలలలో నష్టపరిహారం ఇస్తామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ఈ లోపు ఎన్నికల కోడ్ వస్తుందని, అది ఉండగా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రజలను నమ్మించి, పాత మాటే చెప్పి మోసం చేసి వెళ్లారని ఆరోపించారు.



ప్రధాన రహదారిపై పెద్ద సంఖ్యలో నిలిచిపోయిన వాహనదారులు



పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన ప్రతిపక్ష పార్టీల నాయకులు

ప్రతిపక్ష పార్టీల నాయకుల ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి- విఆర్.పురం

ముఖ్యమంత్రి కూనవరం పర్యటన నేపథ్యంలో నాలుగు మండలాల్లోని ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. విఆర్.పురం జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, శ్రీరామగిరి సర్పంచ్, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్ కుమార్, టిడిపి విఆర్.పురం నాయకులు బీరక సూర్య ప్రకాష్‌రావును సోమవారం తెల్లవారుజామున అరెస్టు చేసి చింతూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే టిడిపి చింతూరు నాయకులు చిన్నారెడ్డి, రామారావు చౌదరి, పోడియం అప్పారావు, కూనవరం బిజెపి నాయకులు పాయం వెంకయ్య, జనసేన వైస్ ఎంపిపి సాంబశివరావును కూడా అరెస్ట్ చేశారు. సిపిఎం నాయకులు, న్యాయవాది రవితేజను సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు అరెస్టు చేసి కూనవరం పోలీసు స్టేషన్ తరలించారు. వీరందరినీ ముఖ్యమంత్రి వెళ్లిపోయిన తరువాత విడిచిపెట్టారు.

అక్రమ అరెస్టులకు ఖండన

అర్ధరాత్రి నోటీసులు ఇచ్చి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పులి సంతోష్ కుమార్, కుంజ అనిల్, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. అక్రమంగా అరెస్టులు చేయడంపై కాకుండా ముందు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం శ్రద్ధ పెడితే బాగుంటుందని హితువుపలికారు. కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా 2022 వరద ముంపు ప్రాతిపదికన ప్రతి గ్రామాన్ని మొదటి కౌంటర్లో చేర్చి పునరావాసం, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఖండన

రంపచోడవరం : కూనవరం మండలంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా ప్రతిపక్ష పార్టీ నాయకులను అర్ధరాత్రి 1 గంట సమయంలో అక్రమంగా నిర్బంధించడం, అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వరద బాధితుల సమస్యలను, కష్టాలను తెలుసుకోవడానికి వచ్చారా? లేకపోతే ప్రశ్నించే గొంతులను, నాయకులను అరస్టు చేపించడానికి వచ్చారా? అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారు లేకపోతే సమస్యలు ఎవరు చెబుతారన్నారు. వరదలకు గురైన గ్రామాలకు కనీసం తక్షణ సహాయక చర్యలు ఇంతవరకు అందలేదని, వీటిని ఎవరూ ప్రశ్నించకుండా ముందస్తుగా అరెస్టు చేశారని ఆరోపించారు.

పాతపాటతో మోసం

విఆర్.పురం : జగన్ మోహన్ రెడ్డి ముంపు బాధితులకు పాత పాటతో మళ్లీ మోసం చేశారని టిడిపి నాయకులు అన్నారు. రేఖపల్లి టిడిపి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ వరద బాధితులకు ఎటువంటి హామీ ఇవ్వకుండా పాతపాడే పాడారు తప్ప ముంపు ప్రజలకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నారావు, పెందుర్తి సుదర్శన్‌రావు, బీరక సూర్య ప్రకాష్ రావు, గోంది చంద్రయ్య, మల్లిఖార్జునరావు, ముత్యాల రమేష్, పాయం రామారావు పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు : పట్టణంలోని వి.ఆర్. కళ్యాణ మండపంలో ఐ.టి.డి.ఎ. ఆధ్వర్యములో ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోదకొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రముల సమర్పణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అధితుల సందేశం, గిరిజన పెద్దలకు సన్మానం, గిరిజన లబ్దిదారులకు యాంత్రీకరణ పరికరములు పంపిణి తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అనంతగిరి : ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని ఆదివాసి ప్రజాసంఘాలు సన్నద్ధం అవుతున్నాయి. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆదివాసుల దినోత్సవం నిర్వహించేందుకు కలిసి రావాలని ఆదివాసి గిరిజన సంఘం ప్రతినిధులు ఎస్.నాగులు, ఎస్. కొండలరావు, జె.సుబ్బారావు, ఆదివాసి ఉద్యోగ సంఘాల నాయకులు పి. దేవుడు, ఎస్.రాంబాబు, గురుదొర, సన్యాసిరావు పిలుపునిచ్చారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)లో ఈ నెల 9న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజ ప్రతినిధులు, సంఘాల నాయకలు, ఎస్‌జిఒలు, గిరిజన ప్రజలు హాజరై వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.



సూర్యనారాయణకు నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: సిపిఎం జిల్లా నాయకులు సూర్యనారాయణ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు పిలుపునిచ్చారు. అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో సూర్యనారాయణ 9వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం బాలాదేవ్, రామారావు. మాట్లాడుతూ, ఆదివాసి గిరిజనులు ఎదుర్కొన్న అనేక సమస్యలపై సూర్యనారాయణ నిరంతరం పోరాటం చేశారన్నారు. బాక్సైట్, చైనా క్లే, కాఫీ, మిరియాల రైతుల, అరకులోయ మండలం పద్మాపురం, కొత్తవలస గార్డెన్ వర్కర్స్ సమస్యలపై పోరాటం చేశారన్నారు. 1/70 పోరాటం అరకువేలిలో నిర్వహించినప్పుడు కీలక పాత్ర పోషించారాన్నారు. ఆయన స్ఫూర్తితో జీవో 3కు చట్టబద్ధత, పివిటిజి లకు రాయితీలు, కాఫీ రైతులకు గిట్టుబాటు ధర, నూతన అటవీ పాలసీ విధానం రద్దు తదితర సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘ మండల కార్యదర్శి పాంగి రామన్న, సిఐటియు నాయకులు రాజు, రాంబాబు, గిరిజన సంఘం నాయకులు సిహెచ్ గురుమూర్తి, మల్లేష్ పాల్గొన్నారు.

గద్దర్ మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజా గాయకుడు గద్దర్ మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటని సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పల్లాల లచ్చిరెడ్డి అన్నారు. ఆయన మరణంతో యావత్తు పీడిత గిరిజనులకు తీవ్ర సోకాన్ని మిగిల్చినట్లయిందని పేర్కొన్నారు. సోమవారం స్థానిక మార్క్స్ యాంగిల్స్ భవనంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానవహక్కుల సంఘం నేత బాలు అక్కిస మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తన ఆటపాటల ద్వారా చైతన్యం చేసిన వ్యక్తి గద్దర్, ఆయన మరణం చాలా బాధాకరమని పేర్కొన్నారు. చిన్నప్పటి నుండి అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.అనసూయ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు పల్లాల అశోక్, ఈ.కాంతం, పిడిఎస్‌యు నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విఆర్ఎలపై ప్రభుత్వం మొండి వైఖరి

-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు- ఐటిడిఎ ఎదుట నిరసన దీక్ష

ప్రజాశక్తి-పాడేరు: గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ)ల పట్ల జగన్ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి, వారి సమస్యలు సత్వరమే పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. వీఆర్ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఎదుట సోమవారం వీఆర్ఏలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన దీక్ష కు ఆయన హాజరై మద్దతు తెలియ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో వీఆర్ఏలు ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. చాలీచాలని జీతాలతో పెరిగిన ధరలతో కుటుంబం గడవక ఆర్థిక భారంతో వీఆర్ఏలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వీఆర్ఏలకు అనేక హామీలు ఇచ్చిందని, నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల కోసమే పని చేస్తున్నానని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉపన్యాసాలు ఇస్తున్నారని, మరి వీఆర్ఏలు అందరూ ఎస్సీ, ఎస్టీలే అని సీఎం గుర్తెరగాలని సూచించారు. వీఆర్ఏలకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వీఆర్ఏల పే స్కేల్ అమలు చేయాలని, ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హామీలను నెరవేర్చాలి : గంగరాజు

అనంతగిరి జడ్పిటిసి సభ్యులు దిసరి గంగరాజు ఈ నిరసన దీక్ష శిబిరానికి హాజరై వీఆర్ఏల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రామస్థాయిలో వీఆర్ఏలపై ఎన్నో బాధ్యతలు అప్పగించి పని భారం పెంచుతుందే తప్ప వారి వేతనాల విషయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చ లేదని విమర్శించారు. వీఆర్ఏల న్యాయమైన పోరాటానికి తమ వంతు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వీఆర్ఏల సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల దీక్షలకు ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానపడాల్, ఆదివాసి గిరిజన మహిళా సంఘం కార్యదర్శి హైమ, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు కొండబాబు, ప్రధాన కార్యదర్శి శేఖర్, దేవిక, త్రినాథ్, కిరణ్ అప్పారావు, సుందర్, కే ఆనంద, కే.యమన, చింతాలమ్మ, సిఐటియు జిల్లా జిల్లా కార్యదర్శి తమర్బ అప్పలకొండ పడాల్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందక గర్భిణి మృతి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఆక్సిజన్ అందక నిండు గర్భిణీ మార్గ మధ్యలో మృతి చెందింది. ఈ ఘటనకు సబంధించి కుటుంబ సభ్యులు, మృతురాలి భర్త అందించిన వివరాలు.. మండలంలోని కొత్త బల్లుగూడ గ్రామానికి చెందిన కిల్లో గీత 8 నెలల నిండు గర్భిణి. ఊపిరితిత్తులు సమస్యతో ఈనెల 3న అరకువేలి ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. శ్వాస ఆడక పోవడంతో ఆదివారం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు విశాఖపట్నం కేజీహెచ్ తీసుకెళ్ళాలని సూచించారు. దీంతో ఆంబులెన్స్‌లో కేజీహెచ్‌కు ఆదివారం తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో ఆక్సిజన్ అందకపోవడంతో గర్భిణి మృతి చెందింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయి పోవడంతోనే చనిపోయిందని మృతురాలి తల్లిదండ్రులు, భర్త ఆవేదన వ్యక్తం చేశారు.

అరకు ఏరియా ఆసుపత్రిలో గైనిక్ డాక్టర్లు, స్కానింగ్, ఇతర వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతోనే గర్భిణీలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆదివాసి గిరిజన సంఘం నేతలు బాలదేవ్, రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తురాయిగుడ గ్రామంలో పర్యటించి మృతి చెందిన కిల్లో గీత తల్లిదండ్రులకు ,కుటుంబ సభ్యులను పరామర్శించించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పేరుకే ఏరియా ఆసుపత్రి కనీసం వైద్య సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. వైద్య సిబ్బంది కొరతతో సరైన వైద్య సేవలు అందక చనిపోతున్నార న్నారు. గర్భిణిలను 125 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నం కేజీహెచ్ రిపర్ చేస్తున్నారని, దీంతో మార్గ మద్యలో ప్రాణాలు కోల్పోతు న్నారన్నారు. అరకులోయ ఆసుపత్రిలో గైనిక్ వైద్యులను నియమించాలని, గీత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



రోధిస్తున్న బంధువులు

వార్డు మెంబర్ స్థానాలకు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొల్లాపుట్టు గ్రామ పంచాయతీలోని రెండవ వార్డు (మహిళా రిజర్వేషన్) మెంబర్ ఎన్నికకు ఈనెల 8 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఎం.ఉషారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 8 నుంచి 10 లోపు కొల్లాపుట్ గ్రామపంచాయతీ సచివాలయంలో నామినేషన్లను సమర్పించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

అనంతగిరి: మండలంలోని నాలుగు పంచాయతీ పరిధి వార్డులకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీవో ఎవివి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతగిరి 7వ వార్డు, పెద్దకోట 9వ వార్డు, బొర్రా 1వ వార్డు, పినకోట 6వ వార్డు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 8వ తేదీన నుండి నామినేషన్లు స్వీకరణ, 11న స్క్రూట్నీ 12న తిరస్కరణ, 14న ఉపసంహరణ, 19న ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, అదేరోజు ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు

పెదబయలు : మండలంలో 23 పంచాయతీలకు ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారని ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య సోమవారం విలేఖరులకు తెలిపారు. పెడికోడపల్లి సర్పంచ్ జనరల్ అభ్యర్థి, ఇంజరి పంచాయతీతో పాటు మిగతా పంచాయతీలలో వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్లు సమర్పించాలని ఎంపీడీఓ తెలిపారు.

వీరానగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి వీరానగర్‌లో మౌలికసదుపాయాలు కల్పించాలని కోరుతూ జివిఎంసి కార్యాలయ సూపరింటెండెంట్‌కు సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, ఐద్వా నాయకులు అనంతలక్ష్మి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బి.రమణి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా వీరానగర్‌లో సుమారు 50 కుటుంబాలు పైబడి నివాసం ఉంటున్నాయని, ఇంటి పన్నులు వేయకపోవడంతో విద్యుత్ మీటర్లు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ లేక పిల్లలు రాత్రి వేళల్లో చదువలేకపోతున్నారని, చీకటిలో పాములు సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని వివరించారు. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

నూతన భవనంలోకి పాఠశాల

ప్రజాశక్తి-సీతమ్మధార : శిథిలావస్థకు చేరుకున్న వాసువేవనగర్ జివిఎంసి ఎలిమెంటరీ పాఠశాలను లక్ష్మీనారాయణపురంలోని నూతన భవనంలోకి మార్చారు. ఈ నూతన పాఠశాల భవనాన్ని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, జివిఎంసి అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో గొండు సీతారాం మాట్లాడుతూ జూన్ చివరి నెలలో పాఠశాలను పరిశీలించానని, శిథిలావస్థలో ఉండటంతో జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, నగర మేయర్ హరివెంకట కుమారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారు స్పందించి త్వరిత గతిన నూతన స్కూల్ భవనంలోకి మార్చడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్ మాట్లాడుతూ, అందరి సహకారంతో త్వరితగతిన కొత్త భవనంలోకి మార్చగలిగామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఎక్స్ అఫీషియో సభ్యులు సేనాపతి అప్పారావు, జివిఎంసి ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి-2 బాలామణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, సిఆర్‌పిటివి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాలి

ప్రజాశక్తి-ములగాడ : చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండేల స్వదేశీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి వి.లక్ష్మీదేవి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత సంస్కృతిలో చేనేత ఒక భాగం అన్నారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతవరకు చేనేతను ధరించాలని, తద్వారా డిమాండ్‌ను ఏర్పరచాలని కోరారు. అధ్యాపకులు అందరూ చేనేత దుస్తులు ధరించి చేనేతను రక్షిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కరాటేతో రక్షణ

ప్రజాశక్తి-గాజువాక : కరాటే ద్వారా రక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజు ప్రాక్టీస్ చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం ఉంటుందన్నారు. వికాస్‌నగర్‌లో రాష్ట్ర వ్యాప్త కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో విశాఖ జిల్లా, రెండు మూడు స్థానాల్లో శ్రీకాకుళం కాకినాడ జిల్లా క్రీడాకారులు నిలిచారు. వారికి సర్టిఫికెట్స్, మెడల్స్, ట్రోఫీలను అతిథుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ కంప్యూటర్స్ అధినేత డాక్టర్ కరణంరెడ్డి నర్సింగరావు, కరాటే సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, సెక్రటరీ తాతారావు, రిఫరీలు శ్రీనివాసరావు, రంజిత్‌కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సంజీవయ్య, రవికుమార్, నవీన్‌కుమార్, ప్రేమ్ కుమార్, సన్నీ, వెంకట్, సీనియర్ కోచ్‌లు, నాగేశ్వరరావు, భువనేశ్వరి, రంజిత్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

19న లక్ష్మీపురం పంచాయతీ ఉప ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ స్థానానికి, టి.నగరపాలెం 10వ వార్డు స్థానానికి ఈ నెల 19వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.వెంకటరమణ సోమవారం ప్రకటించారు. అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 8వ తేదీన సర్పంచ్ లచ్చుబుగత రామారావు మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, తిరస్కరణకు గురైన నామినేషన్లపై 12వ తేదీ వరకు అర్జీలు అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

సమస్యలపై ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుల ధర్నా



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి - పాడేరు : తమ సమస్యలను పరిష్కరించాలంటూ పాడేరు ఐటిడిఎ వద్ద ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. వారినుద్దేశించి సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అధికారుల వేధింపులు అరికట్టాలని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వీరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర జీతం చాలక ఆశాలు, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు వై.మంగమ్మ, దాసమ్మ, పార్వతి, కొండమ్మ పాల్గొన్నారు. వీరి పోరాటానికి ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన పడాల్, వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి శేఖర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అప్పలకొండ, హుకుంపేట వైస్ ఎంపిపి కొండలరావు, గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి హైమావతి మద్దతు తెలిపి మాట్లాడారు.

ఓటర్ల వెరిఫికేషన్‌పై అప్రమత్తంగా ఉండాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రావణ్ కుమార్



మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: స్థానిక ఆర్యన్ ఇన్ రిసార్ట్‌లో టిడిపి క్లస్టర్, యూనిట్ ఇంచార్జులకు ఓటర్ వెరిఫికేషన్‌పై సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ చేయాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్లను చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సివేరి దొన్ను దొర మాట్లాడుతూ, ఓటర్ వెరిఫికేషన్‌లో దొంగ ఓట్లను గుర్తించాలన్నారు.తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా సమిష్టిగా ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్టీ, ఎస్సీ కమిషన్ మెంబర్ సివేరి అబ్రహం, అరకు పార్లమెంట్ కోశాధికారి వంతాల నాగేశ్వరరావు, అరకువేలీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, అనంతగిరి మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు, కిల్లో జలరాం, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, అరకు పార్లమెంట్ టి ఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రటరీ కిల్లో సాయిరామ్, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, ప్రధాన కార్యదర్శులు సిర్ర సూర్యకాంతం, ఆనంద్, పాంగి నాగేశ్వరరావు, డుంబ్రిగుడ మాజీ ఎంపీపీ కొర్ర దానేశ్వరావు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసపై భారీ ర్యాలీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మణిపూర్‌లో ఆదివాసులపై జరుగుతున్న దారుణమైన దాడులను నిరసిస్తూ మండలంలోని అరకు సంత బయలు గ్రామంలో మానవ హక్కుల నేరనిరోధక సంఘం ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. శాంతి వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకొని ఆదివాసులను, క్రైస్తవులను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి మాట్లాడుతూ ఆదివాసులు, క్రైస్తవులపై దాడుకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, విశాఖ జిల్లా ప్రెసిడెంట్ పి శ్రీనివాసరావు, అధ్యక్షుడు రాజేష్, పాస్టర్లు, గిరిజనులు పాల్గొన్నారు



ర్యాలీ చేస్తున్న నేర నిరోధక సంఘం ప్రతినిధులు

నేరాలు ఘోరాలు



నిందితులతో పోలీసులు

280 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి గుట్టుగా గంజాయి తరలిస్తున్న ముఠాని పట్టుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు ప్రాంతం నుండి విశాఖ మైదాన ప్రాంతమునకు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మెయిన్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశామన్నారు. బొలెరోతో పాటు బైక్‌లతో గంజాయి తరలిస్తూ ఐదుగురు నిందితులు పట్టు పడ్డారని తెలిపారు. సుమారు 280 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి ఆర్ఆర్.వెంకటాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... సుజాతనగర్‌లో నివాసముంటున్న రాజశేఖర్ కంచరపాలెంలోని గౌరీ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. రాజశేఖర్ చినముసిడివాడ నుంచి గోపాలపట్నం వైపు వెళ్తుండగా ఆర్ఆర్ వెంకటాపురంలో అల్వార్‌దాస్ కాలేజీ సమీపంలో వెనుక నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్కూటీపై నుండి రాజశేఖర్ ఎగిరి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాకిస్తాన్ హనీ ట్రాప్‌లో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ పాకిస్థాన్ హనీ ట్రాప్ వలలో చిక్కినట్టు సమాచారం అందటంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర నిఘా వర్గాల అలర్ట్‌తో విశాఖ సిఐఎస్ఎఫ్ వింగ్ రంగంలోకి దిగింది. కానిస్టేబుల్ కపిల్ కుమార్ జగదీష్‌ను అదుపులోకి తీసుకొని సిఐఎస్ఎఫ్ అధికారులు విచారిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విశాఖ సిఐఎస్ఎఫ్ యూనిట్ అధికారులు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

తల్లిపాల ప్రాధాన్యతపై ర్యాలీ

ప్రజాశక్తి-మధురవాడ : తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేస్తూ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో రుషికొండ గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లి పాలలోని పోషక విలువలతో బిడ్డకు జీవితకాలం ఆరోగ్య రక్షణ ఉంటుందన్నారు. సుమారు 150 మంది నర్సింగ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ ర్యాలీలో పాల్గొని తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహనకలిగించే బ్యానర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు టి.మాలతి, సిహెచ్.లావణ్య, డి.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్యకళాశాల వైద్యవిద్యార్థుల ఆధ్వర్యాన సోమవారరం తల్లిపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రిలోని ఓపి విభాగంలో లఘు నాటికలు ప్రదర్శించారు. తల్లిపాలను ఏవిధంగా ఎంతకాలం పట్టాలి, బిడ్డకు తల్లిపాలు పట్టేవిధానం, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిమ్సర్ ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, జిమ్సర్ ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిపద్మజ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.బోధిశ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.



ఫాగింగ్ సిబ్బందితో సర్పంచ్ సంతోష్ కుమార్

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి గ్రామపంచాయతీ మెయిన్ సెంటర్, వీధులు, గృహాల చుట్టూ దోమల నివారణకు సోమవారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలకు వచ్చినవాళ్లు వెళ్లిపోయారని సీజన్లో వచ్చే వ్యాధులు బలపడే అవకాశం ఉందని, వ్యాధుల పట్ల ముందు జాగ్రత్త చర్యగా ఫాగింగ్ చేయిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రి సిబ్బంది హెల్త్ క్యాంపులు పెట్టి ప్రజలను వ్యాధుల నుండి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు గొంది దారయ్య, తోడం రాజు, పులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలను నిలువునా ముంచిన వైసిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో అన్ని తరగతుల ప్రజలనూ వైసిపి ప్రభుత్వం నిట్టనిలువుగా ముంచేసిందని టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ విశాఖ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అందరికీ ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, చేస్తున్న అరాచకాలు, విధ్వంసాలను నిరసనల ద్వారా ప్రజలకు తెలియజేయాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం డబ్బులకు కక్కుర్తి పడి ప్రభుత్వ ఆస్తులను విశాఖలో తాకట్టు పెట్టిందని అన్నారు. జగన్ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఛార్జిషీటు కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టామని, అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవి, దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, ఎస్.కోట నియోజవర్గం ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, పార్టీ నాయకులు కోళ్ల రాంప్రసాద్, విఎస్ఎన్ మూర్తి యాదవ్, బొండా జగన్, గంటా నూకరాజు పాల్గొన్నారు.

మృదంగ విద్వాంసులు కేసానపల్లి కన్నుమూత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో పనిచేసిన మృదంగ విద్వాంసులు కేసానపల్లి జ్ఞానానందం (72) సోమవారం ఉదయం కన్ను మూశారు. కుమార్తెకు మందులు విషయమై కేరళ వెళ్లిన ఆయన ఉదయం ఏడు గంటల ప్రాంతంలో గుండె పోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం విశాఖలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ముళ్లపూడి బాణీ అనుసరించే కేసానపల్లి కడప, విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రాలలో 27 ఏళ్లు నిలయ విద్వాంసునిగా సేవలందించారు. విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం నుంచి 2011లో ఉద్యోగ విరమణ చేశారు. విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆయన మృదంగ విద్యనభ్యసించారు. కాట్రావులపల్లి వీరభద్రరావు ప్రియ శిష్యులు. ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు ఎందరికో మృదంగం, కంజీరాలపై సహకరించి లబ్ధ ప్రతిష్టులయ్యారు. మృదంగంలో ఎ గ్రేడ్, కంజీరాలో టాప్ గ్రేడ్ ఆర్టిస్టు అయిన జ్ఞానానందం ఎంతో మందిని మృదంగం కళాకారులుగా తీర్చిదిద్దారు.

మున్సిపల్ కార్మికులపై పోలీసు జులుం

విశాఖలో తీవ్ర నిర్బంధం - కలెక్టర్‌కు సమస్యను చెప్పుకుందామన్నా ఒప్పుకోని ఖాకీలు
ర్యాలీ అడ్డగింత, 200 మంది అరెస్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పారిశుధ్య కార్మికులపై విశాఖలో సోమవారం పోలీసులు జులుం ప్రదర్శించారు. తమ సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకుంటామని ర్యాలీగా బయలుదేరిన కార్మికులకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ప్రతిఘటించి ప్రదర్శనగా వెళ్తున్న వారిపై నిర్బంధం ప్రయోగించారు. 200 మందిని అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మహిళలపై మగ పోలీసులు చేయిచేసుకోవడం, దొరికినవారిని దొరికినట్లుగా వ్యాన్‌లోకి ఎత్తిపడేయడం పోలీసుల దాష్టీకానికి పరాకాష్టగా నిలిచింది. ప్రభుత్వ, పోలీసు చర్యను పలువురు ఖండించారు.



మహిళా కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఇచ్చిన పిలుపునకు విశాఖలో విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున సోమవారం ఉదయానికే కార్మికులు తరలివచ్చారు. సరస్వతీ పార్కు నుంచి ప్రదర్శనగా కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్ళాలని నిర్ణయించారు. పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతులు ఇవ్వకుండా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేసుకోండని నాయకులకు తెలిపారు. ఒక పక్క చర్చలు జరుపుతూనే మరోవైపు ద్వంద్వ వైఖరి అవలంబించారు. ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు సహా వందలాది మంది పోలీసులు మోహరించారు. కార్మికులు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ పెట్టుకుంటే సభ చుట్టూ పోలీసులు గుమిగూడారు. కార్మికుల చుట్టూ రోప్‌తో సర్కిల్ విధించడంపై జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడేవారిపై ఏమిటీ నిర్బంధమని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పర్మినెంట్ చేసే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని తాము అడుగుతున్నామన్నారు. పర్మినెంట్ చేయకుండా కార్మికులను మోసగించడం సరైంది కాదని దుయ్యబట్టారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులే లేకపోతే ఈ నగరం కంపు పట్టిపోతుందని తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లేందుకు కార్మికులు సిద్ధమవగా పోలీసులు 200 మందిని అరెస్టు చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కుమార్, యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, యు.రాజు, టి.నూకరాజు, ఎంవి.ప్రసాదరావు, రమణ, కె.కుమారి, వరలక్ష్మి, జెఆర్.నాయుడు అరెస్టయిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్,హెల్త్ అలవెన్సు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

నిర్బంధం ఆపి తక్షణమే పర్మినెంట్ చేయాలి
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన కార్మికులపై పోలీసులు విరుచుకుపడటాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఒక ప్రకటనలో ఖండించారు. మహిళలపై మగ పోలీసులు చేయిచేసుకోవడం, దొరికినవారిని దొరికినట్లుగా వ్యాన్‌లోకి ఎత్తిపడేయడం వంటి చర్యలపై మండిపడ్డారు. నిర్బంధం ఆపి వెంటనే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మాట తప్పను, మడమ తిప్పనని నాడు చెప్పిన జగన్.. నేడు మాట తప్పి పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయించడం సిగ్గుచేటన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించిన సిపిఎం, సిఐటియు

అక్రమ అరెస్టులను, ప్రభుత్వ నిర్బంధకాండను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో మున్సిపల్ కార్మికుల సేవలు అమోఘమని గుర్తు చేశారు. వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే కార్మికుల ఆగ్రహానికి జగన్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

అనకాపల్లిలో ధర్నా

అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సంఘీభావం తెలియజేసిన ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పర్మినెంట్, కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్, క్లాప్ డ్రైవర్స్, వాటర్ వర్క్స్ తదితర కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమ్మె సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని, డెత్, రిటైర్మెంట్, అనారోగ్యానికి గురైన వారి పోస్టులను వారి వారసులతో భర్తీ చేయాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. సిఐటియు మండలం ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీవీఎంసీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాల కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మాల రాము, వాసు, శేఖర్, శివకుమార్, అమ్మాజీ పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మణిపూర్ అకృత్యాలపై ర్యాలీ

ప్రజాశక్తి-రంపచోడవరం : మణిపూర్‌లో కుక్కి తెగ గిరిజనులు, గిరిజన మహిళలపై హత్యలు, అత్యాచారాలు, క్రైస్తవ మందిరాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా రంపచోడవరంలో ఐక్య క్రైస్తవుల ఆధ్వర్యాన సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక లూదరన్ చర్చ్ నుండి బయలుదేరి ఐటిడిఎ, ఆర్టీసి కాంప్లెక్స్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారం చేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, లెనోవా విద్యాసంస్థల అధినేత బి జాన్ రత్నం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలగజేసుకుని మణిపూర్‌లో క్రైస్తవ ప్రజలు శాంతియుతమైన జీవనం సాగించేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మోజేష్, యర్నిస్ట్ బాబు, మార్క్, తిమోతి, జోసెఫ్ పాల్, మండలంలోని చర్చి పాస్టర్లు, సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

10న నులి పురుగుల మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - పెదబయలు: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల స్థాయి అధికారులతో ఎంపీడీఓ పూర్ణయ్య సమావేశం నిర్వహించారు. ఈనెల 10న డీ వార్మింగ్ మందులను మెడికల్ సిబ్బంది విద్యార్థు లకు పంపిణి చేస్తారని తెలిపారు. ఈ సమావేశం లో పెదబయలు, గోమాంగి, రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులు, మండల విద్యా శాఖధికారులు కొమ్మ కృష్ణమూర్తి, పుష్ప వతి, డేవిడ్, ఉపసంక్షేమ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

చేనేతకు మరింత ప్రోత్సాహం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జాతీయ చేనేత దినోత్సవ స్ఫూర్తితో నేతన్నలకు మరింత ప్రోత్సాహం ఇద్దామని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల డిజైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషికి అసలైన గుర్తింపునిచ్చే చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. గత సంవత్సరం చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇకపై ప్రతి వారం వస్త్ర ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ వంటి ప్రసిద్ధి చెందిన చేనేత వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. చేనేత ఉత్పత్తులకు ఆప్కో ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద మగ్గాల ఆధునికీకరణకు ప్రతి చేనేత కార్మికునికీ రూ.24 వేలు ఇస్తోందన్నారు. చేనేత వస్త్రధారణ ఆరోగ్యదాయకమని, ప్రతి ఒక్కరూ చేనేత కార్మికులను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణమ్మ, డిఎల్‌డిఒ పూర్ణిమా దేవి, డిఇఒ చంద్రకళ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి మాధవి పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయమని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఒకరిని సేవా ఆరోగ్యమిత్రగా పేర్కొంటూ తన ఛాంబర్‌లో సోమవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా ఒకరిని ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారం అందిస్తామన్నారు. జూన్ నెలకుగాను గీతం హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రంతో పాటు రూ.5 వేల నగదు అందించారు.